సాక్షి
ప్రకాశం
సోమవారం । 13 । మార్చి । 2023



మృత్యు శకటాలు
జిల్లాలో రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. వారిలో భార్యభర్త, తండ్రి కుమారుడు ఉన్నారు.
- 8లో..



బాధ్యతాయుతంగా పనిచేయండి
ఎన్నికల నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /22

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు: స్థానిక భాగ్యనగర్‌లోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో డిగ్రీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని డిగ్రీ మూల్యాంకన క్యాంప్ అధికారి డాక్టర్ డి.కళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో జరిగిన రెండో సంవత్సరం మూడో సెమిస్టర్ తాలూకా అన్ని సబ్జెక్టు పేపర్లు వచ్చాయన్నారు. సంబంధిత ఎగ్జామినర్లు సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలన్నారు. స్క్రూటినైజర్లు సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు రిపోర్టు చేయాలన్నారు. ఆయా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్ సంబంధిత అధ్యాపకులను రిలీవ్ చేయాలని క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి తెలిపారు.

ఆరోగ్యశ్రీ ద్వారా తుంటి ఎముక క్యాన్సర్ శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స వివరాలు తెలుపుతున్న డాక్టర్ కౌషిక్ హరి

ఒంగోలు అర్బన్: స్థానిక సుందరరాజ హాస్పిటల్‌లో ఖరీదైన, అరుదైన తుంటి ఎముక క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు ఆస్పత్రి అంకాలజీ సర్జన్ డాక్టర్ కౌశిక్ తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. 28 సంవత్సరాల వయసు ఉన్న మహిళ తుంటి ఎముకలో క్యాన్సర్ గడ్డ ఉండటంతో పాటు ఎముక విరిగిపోయి నడవలేని స్థితిలో ఆస్పత్రికి వచ్చారన్నారు. అరుదైన శస్త్ర చికిత్స ద్వారా క్యాన్సర్‌గడ్డను తొలగించడంతో పాటు మెటల్ ఎముక, జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు తెలిపారు. కేవలం రెండు రోజులకే స్టాండ్ సహాయంతో నడవగలుగుతోందని ఫిజియోథెరపీ ద్వారా రెండు వారాల్లో సాధారణ నడక వస్తుందని చెప్పారు. సుమారు రూ.7 లక్షల విలువైన ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించామన్నారు. ఇలాంటి ఆపరేషన్ జిల్లాలో ఇదే మొదటిదన్నారు.

తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కానుంది. పోలింగ్ స్టేషన్ల వద్ద అన్ని మౌలిక వసతులను సమకూర్చారు. తగినంత సిబ్బందిని కేటాయించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మండలి పోరుకు సై

- నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎన్నికల బరిలో పట్టభద్రుల అభ్యర్థులు 22 మంది, ఉపాధ్యాయ అభ్యర్థులు 8 మంది
- ఎన్నికల సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలింపు
- ఎమ్మెల్సీ ఎన్నికలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్



ఒంగోలు పీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లోని ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ఒంగోలు పీవీఆర్ గ్రౌండ్‌లో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన ఈ తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. అందుకోసం జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ స్టేషన్ల వద్ద బారికేడ్లు, లైటింగ్, షామియానాలు, టేబుల్స్, కుర్చీలు, మంచినీటి సౌకర్యం, ఓటుహక్కు వినియోగించుకునేందుకు రహస్య బాక్సులు లాంటివి ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 138 పోలింగ్ కేంద్రాలను 51 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం ఉదయం నుంచే ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లేలా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏఎస్.దినేష్ కుమార్ ఏర్పాట్లు చేయించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మొత్తం 30 మంది:
తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మొత్తం 30 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 22 మందికాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 8 మంది బరిలో నిలిచారు. వీరిలో ప్రధానంగా అధికార వైఎస్సార్‌సీపీ తరుపున పట్టభద్రుల ఎన్నికల బరిలో పేర్నాటి శ్యాం ప్రసాద రెడ్డి కాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. వీరికి ప్రధాన ప్రత్యర్థులుగా టీడీపీ, పీడీపీ తరపున పోటీ చేస్తున్న వారు బరిలో నిలిచారు. మిగతా వారంతా నామమాత్రంగా పోటీలో ఉన్నవారే. నూతన ప్రకాశం జిల్లాలో మొత్తం 88,014 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీటిలో 98 పోలింగ్ స్టేషన్లు పట్టభద్రుల కోసం, 40 పోలింగ్ స్టేషన్లు ఉపాధ్యాయ ఓటర్ల కోసం చేటాయించారు. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 82,225 మంది కాగా, ఉపాధ్యాయ ఓటర్లు 5,789 మంది ఉన్నారు.

ఎన్నికల విధుల్లో 1600 మందికి పైగా పోలీసులు...
ఎమ్మెల్సీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు జిల్లాలో మొత్తం 1600 మందికి పైగా పోలీసులను కేటాయించారు. ఎస్పీ మలికగర్గ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నారు. 8 మంది డీఎస్పీలు, 15 మంది సీఐలు, 68 మంది ఎస్సైలు, దాదాపు 50కు పైగా పోలీస్ ప్రత్యేక బృందాలు, స్ట్రైకింగ్ ఫోర్సులు, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయటంతో పాటు ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద 144 సెక్షన్ విధించారు. సాధారణ ప్రజలు వంద మీటర్ల దూరంలో ఉండేలా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్న బాలినేని:
వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నేటి శ్యాం ప్రసాద రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డిలను గెలిపించాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తుపెట్టుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు నిరుద్యోగులకు లక్షల్లో ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు.

తొలి ప్రాధాన్యత ఇస్తేనే ఓటు చెల్లుబాటు:
ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాధాన్యత ఓటు విధానంలో నిర్వహిస్తారు. ఓటర్లు తమ తొలి ప్రాధాన్యత ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఓటు చెల్లుబాటు కాదు. ఓటింగ్‌కు సంబంధించి అధికారులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. అవి ఇలా..

- పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రంతో పాటు ఇచ్చిన ఊదా (వయోలెట్) రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే ఓటు వేయాలి.
- ఓటరు తాను మొదటి ప్రాధాన్యత ఇవ్వదలచుకున్న అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న ఖాళీ గడిలో '1' అంకెను రాయాలి. తదుపరి ప్రాధాన్యతలను చెప్పడానికి 2 ,3, 4, 5 ... అంకెలను ద్వారా ఆయా అభ్యర్థుల పేర్లకు ఎదురుగా ఉన్న గడిలో రాయాలి. ఓటు (బ్యాలెట్ పత్రం) చెల్లుబాటు కావడానికి ఓటర్లు తప్పనిసరిగా తొలి ప్రాధాన్యత (1)ను ఇవ్వాలి.

మిగిలిన అభ్యర్థులకు తదుపరి ప్రాధాన్యత ఓట్లు వేయడం, వేయకపోవడం ఓటర్ల ఇష్టం. తొలి ప్రాధాన్యత ఓటు వేసి, తదుపరి ప్రాధాన్యత ఓట్లు వేసినా, వేయకున్నా ఓటు చెల్లుబాటు అవుతుంది.

- ప్రాధాన్యతలను తెలిపేందుకు అంతర్జాతీయ ప్రామాణిక అంకెలు 1, 2, 3, 4... లేదా రోమన్ అంకెలు లేదా భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్ గుర్తించిన ఇతర భారతీయ భాషల్లో ఉపయోగించే అంకెలను వినియోగించవచ్చు. అయితే ఓటరు ఒకే భాష/ సంఖ్యా విధానానికి సంబంధించిన అంకెలను మాత్రమే వాడాలి. భిన్నమైన న్యూమరికల్స్‌ను ఉపయోగించ కూడదు. ఒకటి, రెండు, మూడు అని అక్షరాల్లో రాయకూడదు.
- ఒకే సంఖ్యను ఒక అభ్యర్థి కన్నా ఎక్కువ మందికి ఇవ్వకూడదు.
- ఏ ఒక్క అభ్యర్థికి ఒకటి కన్నా ఎక్కువ ప్రాధాన్యతలను ఇచ్చినా ఓటు చెల్లుబాటు కాదు.
- బ్యాలెట్ పత్రంపై ఓటర్లు తమ ఇంటి పేరు, ఇతర పదాలు, సంతకం, పొడి అక్షరాలు రాయకూడదు. వేలిముద్రలు కూడా వేయకూడదు.
- అభ్యర్థి ఎదురుగా ఉన్న గడిలో మాత్రమే ప్రాధాన్యత సంఖ్యను రాయాలి.
- ఓ క్రమపద్ధతిలో మడతపెట్టిన బ్యాలెట్ పత్రాన్ని ఓటర్లకు పోలింగ్ అధికారులు అందిస్తారు. ఓటర్లు మడత విప్పి ఓటు వేసిన తర్వాత మళ్లీ అదే తరహాలో మడత పెట్టి బ్యాలెట్ బాక్సులో వేయాలి.

జిల్లాలో పోలింగ్ నిర్వహణకు నియమించిన సిబ్బంది 750	
పోలీసు సిబ్బంది: 1600 మంది	పోలింగ్ స్టేషన్లు: 138
వీటిలో పట్టభద్రులకు కేటాయించినవి: 98	
ఉపాధ్యాయ ఓటర్లకు కేటాయించినవి: 40	
గ్రాడ్యుయేట్ ఓటర్లు: 82,225	ఉపాధ్యాయ ఓటర్లు: 5,789

పోలింగ్ సిబ్బంది 750 మందికి పైగా విధుల్లో...

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మొత్తం 750 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరిలో ప్రెసెడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల సంఖ్యను బట్టి ముగ్గురు నుంచి ఆరుగురి వరకు కేటాయించారు. వీరు కాకుండా అదనంగా రూట్ ఆఫీసర్లు కూడా విధుల్లో ఉంటారు.



పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ఈ గుర్తింపు కార్డుల్లో ఏదున్నా ఓకే...

ఓటు హక్కు వినియోగించుకునేవారు పది గుర్తింపు కార్డుల్లో ఏవైనా చూపొచ్చని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ తెలిపారు. ఏదో ఒక కార్డు తప్పనిసరిగా చూపించాలన్నారు.

ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు జారీ చేసిన సర్వీస్ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారిక గుర్తింపు కార్డు, విద్యాసంస్థలు జారీచేసిన సర్వీస్ గుర్తింపు కార్డు, విశ్వవిద్యాలయాలు జారీచేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజినల్ ధ్రువపత్రం, దివ్యాంగుల ధ్రువపత్రం, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ జారీచేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల్లో దేన్నయినా చూపించవచ్చు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- 90 శాతానికి పైగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు
- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం అని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12 సంవత్సరాలు పూర్తయి 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టామన్నారు. మాట తప్పం-మడమ తిప్పం అన్న వైఎస్సార్ ఆశయాన్ని సాకారం చేసే దిశలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రం ఆర్థికంగా క్లిష్టస్థితిలో ఉన్నా మ్యానిఫెస్టోలో ప్రకటించిన 90 శాతానికిపైగా హామీలు నెరవేర్చారన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టి పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి కార్యకర్త, నాయకులు, లబ్ధిదారులు అండగా నిలిచి కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి గనుకనే విశాఖలో గ్లోబల్ సమ్మిట్‌ను రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. అటువంటి నాయకుని ఆదేశాలతో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలోకి దిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో విజయం వరించేటట్లుగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారని, అవన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. ఇది ఉపాధ్యాయులు, ఉద్యోగులు గుర్తించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు, పార్టీ పట్ల అనితర అభిమానాన్ని ప్రదర్శిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అంటేనే మొదట గుర్తుకు వచ్చేది నిరుపేద, బడుగు బలహీనవర్గాల ప్రజానీకం అన్నారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కడం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలుగా మనందరికీ గర్వకారణం అన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మహిళా పక్షపాతిగా సీఎం నిరూపించుకున్నారన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దశాబ్దాల తరబడి కేంద్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురాలేకపోయారని, ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటిసారే 50 శాతానికిపైగా చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించిన విషయాన్ని మహిళలు గుర్తుంచుకుని సీఎం జగనన్నకు అండగా ఉందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, టైలర్స్ వెల్ఫేర్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ షేక్ సుభాన్‌బీ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, జోనల్ ఇన్‌చార్జ్‌లు బడుగు ఇందిర (మహిళా విభాగం), బొట్ల సుబ్బారావు (సాంస్కృతిక విభాగం), మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు కటారి శంకర్, గంటా రామానాయుడు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పురిణి ప్రభావతి, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, బేతపూడి రాజేశ్వరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోనుగుంట్ల రజని, దాసరి కరుణాకర్, మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ జాని, నగర అధ్యక్షుడు షేక్ మీరావలి, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సూపర్‌బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ ఆంజనేయరెడ్డి, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, ఒంగోలు డ్రగ్స్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు దగ్గుమాటి వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

మార్కాపురం టౌన్: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సిబ్బందికి సూచించారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళ వందనంతో కలిసి పరిశీలించారు. పోలింగ్ సమయంలో సందేహాలు వస్తే ప్రిసైడింగ్ అధికారులకు, ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. ఏమైనా సహాయం అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, జిల్లా కేంద్రంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కేటాయించిన పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ సిబ్బందికి మంచి ఆహారం, శుభ్రమైన తాగునీరు, టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం ఇచ్చేలా హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో అనవసరమైన రద్దీని నియంత్రించేలా ఓటర్లను వరుసలో నిలుచునేలా చూడాలన్నారు. పోలింగ్‌ను వెబ్ కెమెరాలతో వీడియోలను చిత్రీకరించి ఎన్నికల సిబ్బందికి సహకరించాలన్నారు.



వెబ్ కెమెరా సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

అంచెలంచెలుగా ఎదుగుతూ అధికారంలోకి..

- వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంచెలంచెలుగా ఎదుగుతూ అధికారంలోకి వచ్చిందని, అనేక కష్టాలను చవిచూసినా రాష్ట్ర ప్రజలకు మేలు చేసేలా అనేక సంక్షేమ పథకాలు అమలు పరచిందని, అందుకు ప్రధాన కారణం వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధత, నిజాయితీనేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక రాజీవ్ అతిథి గృహంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇద్దరు సభ్యులతో ప్రారంభమైన పార్టీ ఈ రోజు 151 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలు, 22 మంది పార్లమెంటు సభ్యులు, 8 మంది రాజ్యసభ సభ్యులతో చట్టసభల్లోకి ప్రవేశించిందని అన్నారు. 40 సంవత్సరాల క్రితం ఏర్పాటైన పార్టీ అని ఒకరు, స్వతంత్రం రాకముందు నుంచి ఉన్న పార్టీ అని మరొకరు, యువత ఉన్న పార్టీ అని ఇంకొకరు చెప్పుకుంటున్నారని, టీడీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీల గురించి ఆయన వ్యాఖ్యానించారు. ఎప్పుడు వచ్చామనికాదు, బుల్లెట్ దిగిందా..లేదా అని మంత్రి సినిమా డైలాగ్‌తో ఆకట్టుకున్నారు. కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం అని, కార్యకర్తలు, నాయకులు పార్టీని కాపాడుకున్న తీరు అమోఘమైందని కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో కష్టాలు వచ్చాయని, అధికారంలో ఉన్నప్పటికీ విధానపరమైన కొన్ని నిర్ణయాలు, ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. కోవిడ్ మహమ్మరిలాంటి పరిస్థితుల్లో ఆదాయం గణనీయంగా పడిపోయి ప్రభుత్వ ఖజానాలో చాలా ఇబ్బందులు వచ్చినా సంక్షేమ పథకాలు ఆపకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఈరోజు సంతోషంగా ఉండటానికి దోహదపడ్డాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం రూ.1 లక్ష 76 వేల కోట్లు పంపిణీ చేశారని, దేశంలో ఎక్కడా సంక్షేమం కోసం ఇంతపెద్ద బడ్జెట్ కేటాయించింది లేదని అన్నారు.

రాబోయే 30 ఏళ్ల వరకు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటుందనే నమ్మకాన్ని ప్రతి ఒక్కరి గుండెల్లో నాటుకునేలా జగనన్న తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ఒక క్యాడర్‌ను తీసుకొని రావాలన్న ఆలోచనతో గృహసారథులను ఏర్పాటు చేసుకున్నారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 సదస్సులో దేశ, విదేశాల నుంచి వచ్చిన పారిశ్రామిక దిగ్గజాలు రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బి.బాలచెన్నయ్య, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, పెద్దకాపు వెంకటరెడ్డి పాల్గొన్నారు.



వైపాలెంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

క్లుప్తంగా

కంభంలో చోరీ



బీరువాలోని వస్తువులు చిందరవందరగా వేసిన దుండగులు

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని చోరీ జరిగి రూ.25 వేల నగదు అపహరించారు. ఈ ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే..కాలనీలో నివాసముంటున్న నరేష్ ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లగా భార్య బంధువుల ఇంటికివెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా వేసి అందులోని రూ.25 వేల నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం దొంగతరం జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరించారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

అర్థవీడు(కంభం): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కాకర్లలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దొనకొండ మండలం పుల్లయ్యపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ (18) కాకర్ల సమీపంలో జేసీబీతో పనులు జరుగుతుండగా.. డ్రైవర్‌కు హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. పంటపొలాల వద్ద ఉన్న ఓ రేకుల షెడ్డులో ఉరేసుకొని కనిపించగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. శనివారం రాత్రి ఉరేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. యువకుడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కనిగిరిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్



దర్శిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



టంగుటూరులో కేక్ కట్ చేస్తున్న వరికూటి అశోక్‌బాబు, ఇతర నేతలు

ఉప్పొంగిన ఉత్సాహం

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



పొదిలిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

బ్రహ్మోత్సవం.. భక్తి పరవశం



హంస వాహనంపై శ్రీవారు



అలంకరణలో ఉత్సవమూర్తులు

- హంస వాహనంపై శ్రీవారి ఉత్సవం

కొనకనమిట్ల: శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ వెలుగొండ క్షేత్రం భక్తుల జయజయ ధ్వానాలతో పరవశించిపోతుంది. ప్రసిద్ధపుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి రోజుకో అవతారంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం పల్లకిలో అలంకరించిన హంస వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధులలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి పల్లకిని మోసి తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవ ఉభయదాతలు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవనకుమార్‌శర్మ, సింహాద్రి చార్యులు, యుగంధర్‌చార్యులు స్వామికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం శ్రీవారు శేష వాహనంపై ఉత్సవ మూర్తులు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో లక్ష్మీ సమేత గోపయ్య తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు మునుస్వామి ఎడ్లు 3600 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం ఆణవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 3450 అడుగులు లాగి రెండోస్థానంలో, పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ముద్దపాటి శ్రీనివాసులు జత ఎడ్లు 2986 అడుగులు లాగి మూడవస్థానంలో, 2వ జత ఎడ్లు 2850 అడుగులు లాగి నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గ్రామస్తుల సహకారంతో ఎడ్ల యజమానులకు అందజేశారు.



పోటీలో బండ లాగుతున్న ఎడ్లు

మృత్యు శకటాలు

- కారు, ఆటో ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం
- కనిగిరి, కొమరోలు మండలాల్లో ఘటనలు
- మృతుల్లో భార్య భర్తలు, తండ్రి కొడుకులు

కనిగిరి/కొమరోలు: జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో భార్య భర్తలు, తండ్రి కుమారుడు ఉన్నారు. ఈ ఘటనల్లో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..



మృతుడు నర్రా బ్రహ్మేశ్వరరావు



మృతుడు నర్రా రామకోటేశ్వరరావు




క్షతగాత్రు రాలు నర్రా సత్యవాణి

వివాహానికి వెళ్లి వస్తూ.. మృత్యు ఒడికి

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు, అతని కుమారుడు నర్రా బ్రహ్మేశ్వరరావులు అక్కడికక్కడే మృతి చెందారు. రామకోటేశ్వరరావు భార్య సత్యవాణికి తలకు బలమైన గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు.

వివాహానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో..

పోలీసుల కథనం ప్రకారం..కృష్ణాజిల్లా పెసలపాడు గ్రామానికి చెందిన నర్రా రామ కోటేశ్వరరావు కుటుంబం 23 ఏళ్ల కిత్రం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి వలస వచ్చి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాపట్ల జిల్లా రేపల్లె దగ్గర రాయవారిపల్లిలో వివాహానికి నర్రా బ్రహ్మేశ్వరరావు, తండ్రి రామకోటేశ్వరరావు, తల్లి నర్రా సత్యవాణిలు కలిసి కారులో వెళ్లారు. పెళ్లి అనంతరం శనివారం రాత్రి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు 2:30 గంటల సమయంలో కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్దకు రాగానే చప్టా గుంతలో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న నర్రా బ్రహ్మేశ్వరరావు (48), నర్రా రామకోటేశ్వరరావు(67) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సత్యవాణికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు పంపించారు. కారులో ఇరుక్కున్న నర్రా బ్రహ్మేశ్వరరావు మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. తండ్రి కుమారుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా మృతుడు రామకోటేశ్వరరావు పుట్టు అంధుడని బంధువులు తెలిపారు. నర్రా బ్రహ్మేశ్వరరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ బి.పాపారావు, ఎస్సై దాసరి ప్రసాద్‌లు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటన ప్రదేశంలో మృతదేహాలు

ఆగి ఉంటే ప్రాణాలు దక్కేవి..

మార్గమధ్యంలో పొదిలిలో ఆగి ఉదయాన్నే వెళ్లాలని బంధువులు చెప్పినా వినకుండా ప్రయాణం సాగించనట్లు తెలిపారు. ఆగి ఉన్నా ప్రాణాలు మిగిలేవేమోనని బంధువులు బోరున విలపిస్తున్నారు. సుమారు ఒంటి గంట సమయంలో మృతుడు బ్రహ్మేశ్వరరావు భార్య జ్యోతికి ఫోన్ చేసి దర్శి సమీపంలో ఉన్నానని చెప్పాడని, ఆ తర్వాత ఫోన్ పనిచేయలేదని కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆటో బోల్తాపడి.. భార్యభర్తలు దుర్మరణం

కొమరోలు: రోడ్డుపై కుక్కలను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అక్కపల్లె గ్రామసమీపంలో తిప్ప వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు...మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన మందా రాజయ్య, వారి కుటుంబసభ్యులు ముగ్గురు వ్యక్తులు ఆటోలో తాటిచెర్లమోటు గ్రామంలో హోసన్న మందిరానికి వెళుతున్నారు. అక్కపల్లె గ్రామసమీపంలోని మూలమలుపు వద్ద అకస్మాత్తుగా కుక్కలు అడ్డు రావడంతో వేగంగా వెళుతున్న ఆటో వాటిని తప్పించబోయి బోల్తా పడింది. ప్రమాదంలో మందా రాజయ్య (62), మందా దానమ్మ (58)పైన ఆటోపడడంతో రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. దానమ్మ, ఆటోడ్రైవర్ మందా చిన్నరాజు, దీపికలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మందా దానమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. చిన్నరాజు, దీపిక గిద్దలూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుమారుడు యువరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గోపాలక్రిష్ణ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నల్లగుంట్ల గ్రామానికి చెందిన దంపతులు రహదారి ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



మందా రాజయ్య, దానమ్మ (ఫైల్)



రోడ్డుపై పడి ఉన్న రాజయ్య మృతదేహం

బాధ్యతాయుతంగా పనిచేయండి

- పోలింగ్ కేంద్రంలోకి ఓటరు పత్రం, గుర్తింపు కార్డు తప్ప ఇతరత్రా తీసుకురారాదు
- ఎన్నికల విధుల్లో 1500 మంది సిబ్బందికి బాధ్యతలు
- పోలింగ్ కేంద్రంలో వీడియోలు, ఫొటోలు నిషిద్ధం
- ఎస్పీ మలికాగర్గ్



హాజరైన పోలీసు అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి స్థానిక ఆంధ్రకేసరి విద్యాలయంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 1500 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఉన్నాయని, పోలింగ్ మెటీరియల్ సంబంధిత పోలింగ్‌స్టేషన్లకు చేరడం , ఎన్నిక ముగిసిన తరువాత తిరిగి డిస్ట్రిబ్యూషన్ పాయింట్లకు చేరే వరకు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల వరకు జనం గుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి నిషేధిత వస్తువులతో పాటు మొబైల్‌ఫోన్స్, స్మార్ట్ వాచీలు, ఐపాడ్, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, అగ్గిపెట్టె, రసాయన ఇంకు బాటిళ్లు, వాటర్ బాటిళ్లు వంటివి తీసుకువెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లు క్యూలైన్ పాటించేట్లుగా చూడాలని, ఓటర్లను పూర్తిగా తనిఖీ చేసి ఓటర్ స్లిప్, ప్రభుత్వం ఇచ్చిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును మాత్రమే ఓటర్‌తో పాటు పోలింగ్ బూత్‌లోకి పంపాలన్నారు. పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేయడం, ఓటర్లను ప్రభావితం చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటివి జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సమయస్ఫూర్తితో విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 51 ప్రాంతాలు ఉన్నాయని, వాటిలో 15 సెన్సిటివ్, 9 హైపర్ సెన్సిటివ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు అదనపు ఎస్పీలు పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్‌కు కె.నాగేశ్వరరావు(అడ్మిన్), కనిగిరికి అశోక్‌కుమార్(ఏఆర్ అదనపు ఎస్పీ), మార్కాపురం శ్రీధర్‌రావు(క్రైమ్స్ అదనపు ఎస్పీ)లను నియమించామన్నారు. వీరితో పాటు డీఎస్పీలు-8మంది, సీఐలు -15 మంది, ఎస్సైలు -68 మంది మొత్తం 1500 మందికిపైగా పోలీస్ సిబ్బంది విధులలో ఉంటారన్నారు. 8 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 38 స్ట్రైకింగ్ ఫోర్స్, 15 క్విక్ రెస్పాన్స్ టీమ్స్, 38 ఫ్లయింగ్ స్క్వాడ్లు, సెక్టార్ మొబైల్స్ 22తో పాటు 11 చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల నియమావళి, రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పోలింగ్ బూత్‌ల లోపల ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి పోలీసుశాఖకు సమాచారం ఇవ్వాలనుకుంటే డయల్ 100 లేదా 112 కాల్ చేయాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.